క్లుప్తంగా

అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్ సురేష్‌బాబు

కడప కార్పొరేషన్ : క్రిస్మస్ స్టార్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని వైఎస్సార్‌సీపీ నాయకులు సెబాస్టియన్ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం స్థానిక సున్నపురాళ్లపల్లి సంధ్యా సర్కిల్ కూడలిలో వెయ్యి మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మేయర్ సురేష్ బాబు, శాప్ డైరెక్టర్ డేనియల్ ప్రదీప్‌లు ముఖ్య అతిథులుగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రామ్ లక్ష్మణ్‌రెడ్డి, మల్లికార్జున, కె.బాబు, ఆర్.చెన్నయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారాయుడు, శ్యాంసన్, లక్ష్మినారాయణ, విన్సంట్, సునీల్, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

- అనాథ వృద్ధుల ఆకలి తీర్చడం మహాభాగ్యమని శ్రీ సాయి యువజన సేవా సంఘం అధ్యక్షుడు మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక శ్రీ చౌడమ్మ వృద్ధాశ్రమంలో పుచ్చకాయల సతీష్‌కుమార్ కుమార్తె రెడ్డి నాగ సమస్వి సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సతీష్ కుమార్ కుటుంబ సభ్యులు, డి.సుబ్బరాయుడు, విష్ణు, వృద్ధాశ్రమ నిర్వాహకులు సమీర్ తదితరులు పాల్గొన్నారు.


అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

కడప అర్బన్ : కడప నగరంలోని అంగడివీధి వాస్తవ్యులు పిల్లోల్ల గుర్రప్ప (70) గత కొన్ని రోజులుగా కడప రిమ్స్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతనికి వివాహం కాలేదు. అతనికి దూరపు బంధువులు అంతిమ సంస్కారం చేసేందుకు ముందుకు రాకపోవడంతో స్థానికుల విన్నపంతో శ్రీ కాశీ విశ్వనాథ సేవాసమితి ఆధ్వర్యంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, రెడ్డి లక్ష్మణ్, పుట్టా పురుషోత్తం, దామోదర్, దినేష్ జంబ, రాఘవేంద్ర, ఆర్టీసీ కండక్టర్ శారదమ్మ పాల్గొన్నారు.

ఉనికి కోసం పుత్తా పాట్లు

చింతకొమ్మదిన్నె : కమలాపురం టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి తన ఉనికి కోసం నానా పాట్లు పడుతున్నాడని 17వ డివిజన్ కార్పొరేటర్ గుత్తిరెడ్డి చంద్రహాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో పుత్తా నరసింహారెడ్డి గ్రామాల్లో పర్యటిస్తూ టీడీపీ కార్యకర్తలకు టీడీపీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీ నుంచి భారీ చేరికలు అంటూ పచ్చపత్రికల్లో డబ్బాలు కొట్టుకుంటున్నారన్నారు. 17వ డివిజన్ నుంచి ఒక వైఎస్సార్‌సీపీ కార్యకర్త కానీ, నాయకులు కానీ టీడీపీ కండువా కప్పుకోలేదన్నారు. మొదట నియోజకవర్గంలో పుత్తాకే షూరిటీ లేదు.. గ్యారెంటీ లేదు ఆయన ప్రజలకు ఏంటి గ్యారెంటీ ఇచ్చేది అని ప్రశ్నించారు. 17వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ క్యాడర్ బలంగా ఉండటంతో తప్పుడు ప్రకటనలు, తప్పుడు ప్రచారాలు టీడీపీ నాయకులు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జి గుత్తిరెడ్డి లక్ష్మిరెడ్డి, మట్లి శ్రీనివాసులురెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

అలరించిన నృత్యం



శిల్పారామంలో విద్యార్థుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా స్థానిక జీఎంఆర్ ఇంగ్లిషు మీడియం స్కూలు విద్యార్థులు తమ నృత్యాలతో అలరించారు. ఇటీవల విస్తృత ప్రచారంలో ఉన్న సినిమా పాటలతోపాటు జానపద గీతాలకు కూడా వారు హుషారు గొలిపే నృత్యాలతో ఆకట్టుకున్నారు. తల్లిదండ్రులు, సహ విద్యార్థులు వారిని అడుగడుగునా ప్రోత్సహిస్తూ కరతాళ ధ్వనులు చేశారు. శిల్పారామం ఏఓ శివప్రసాద్ రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట బుగ్గలేటిపల్లి గ్రామ సమీపంలో వెలసిన గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. కోరికలు తీరిన భక్తులు అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ సమీపంలోని ఆంజనేయ స్వామి, సాయిబాబా, అక్కదేవతలు, నవగ్రహాలు, వైద్యనాథీశ్వరుడు, వీరభద్రస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కంపచెట్ల తొలగింపు

చెన్నూరు : స్థానిక హిందూ స్మశాన వాటికకు వెళ్లే దారి కంపచెట్లు, పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవా రు. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో అయన స్పందించి శనివారం తన సొంత నిధులతో స్మశానం వెళ్లే దారిలో ఉన్న కంప చెట్లు, పిచ్చి మొక్కలను జేసీబీ సహాయంతో తొలగించారు.

ఉల్లాస భరితంగా ముగ్గుల పోటీలు



పోటీలో పాల్గొని ముగ్గులు వేస్తున్న మహిళలు



బహుమతులు అందుకున్న విజేతలతో నిర్వాహకులు

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) కడప శాఖ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎన్జీఓ కాలనీలో నిర్వహించిన ఈ పోటీలకు స్థానిక మహిళల నుంచి విశేష స్పందన లభించింది. మహిళా మణులు ఒకరినొకరు పోటీలు పడి రంగు రంగుల ముగ్గులు వేసి అందరినీ ఆకర్షించారు. పోటీలో తేజస్విని, రేణుక, గౌరీలు మొదటి, రెండవ, మూడవ బహుమతులు సాధించారు. మరో ముగ్గురికి నిర్వాహకులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా చిట్టెం రాజ్యలక్ష్మి, వంకధారి విజయకుమారి, ఆకుల కల్పనలు వ్యవహరించారు.

ఆవోపా ప్రతినిధులు వంకధారి పుల్లయ్య, చిట్టెం రమేష్, కర్నాటి సురేష్, ఆకుల సత్యప్రసాద్, కృష్ణం, శివలు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మహిళా విభాగం అధ్యక్షులు చెప్పరపు నాగ పుష్పాంజలి, కార్యదర్శి దశమందం వెంకట సుప్రియ, దరిశా నాగ సునీత, కో ఆర్డినేటర్లు మాధవీలత, ప్రసన్న, శ్రీదేవిలు పోటీదారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పోటీలో పాల్గొన్న వారందరికీ నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

సంక్రాంతి సంబరాలకు విద్యార్థుల సన్నద్ధం





వైవీయూలో సంక్రాంతి సంబరాలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం సంక్రాంతి సంబరాలకు సన్నాహాలు ప్రారంభించింది. విశ్వవిద్యాలయంలోని గురుకులం భవనాల్లో వాణిజ్యవిభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు సంప్రదాయ వేడుకలకు సన్నాహాలు ప్రారంభించారు. గ్రామీణ సంప్రదాయాలను, ఆచారాలను తెలియజెప్పేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉట్టికొట్టే పోటీలు, గాలిపటాలు, ముగ్గుల పోటీలు, హరిదాసు కీర్తనలకు సంబంధించిన ఏర్పాట్లను పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో సంప్రదాయాలు, ఆచారాలను తెలియజేసేలా, సంక్రాంతి సంబరాలు ఉట్టిపడేలా విద్యార్థులు సందడిగా పనులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దూరవిద సంచాలకులు ఆచార్య కె.కృష్ణారెడ్డి, కామర్స్ విభాగం ఆచార్యులు డాక్టర్ విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేసి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. చనిపోయిన కార్మికుల కుటుంబంలో కారుణ్య నియామకాలు కల్పించాలన్నారు. మీటర్ రీడర్లకు, పీస్ రేటు వర్కర్లకు పని భద్రత కల్పించాలన్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు వేతన సవరణ బకాయిలు చెల్లించాలన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, డిస్కన్ అధ్యక్షుడు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

‘ఎస్మా’ను ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర

కడప సెవెన్‌రోడ్స్ : అంగన్వాడీలు న్యాయమైన తమ డిమాండ్ల పరిష్కారం కోసం పోరాడుతుండగా ఎస్మా చట్టం ద్వారా సమ్మెను నిషేధించడం అన్యాయమని, తక్షణమే ఉపసంహరించుకోవాలని వివిధ రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. ఆదివారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి, హరిప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి మాట్లాడారు. అంగన్వాడీలు చేస్తున్న ఉద్యమానికి తాము అండగా ఉంటామని తెలిపారు. అంగన్వాడీలకు నిత్యావసర ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని కోరారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు. లబ్ధిదారులకు మెరుగైన పౌష్టికాహారాన్ని అందించాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీఓ విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్తార్, బీఎస్పీ నాయకుడు సగిలి గుర్రప్ప, లోక్‌సత్తా నాయకుడు దేవర శ్రీకృష్ణ, ఏఐటీయూసీ నాయకులు కేసీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలోని ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న ఉద్యమాన్ని అణచి వేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఎస్మా చట్టాన్ని ఎత్తి వేయాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కడప నగరంలోని వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్లతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వైఎఫ్ నాయకుడు భాస్కర్ పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ అడ్డుకోవడం అన్యాయం



మాట్లాడుతున్న ఏపీ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.జగన్‌మోహన్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : అనంతపురం పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల సమీపంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడం అన్యాయమని ఏపీ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విగ్రహావిష్కరణ ఈ నెల 7వ తేదీ జరుగుతుందని, గతంలోనే ప్రకటించామన్నారు. అలాగే రెడ్ల ఆత్మీయ కలయిక సభ కూడా అక్కడే ఏర్పాటు చేశామన్నారు. అయితే ముందస్తు సమాచారం లేకుండా శనివారం అర్ధరాత్రి పోలీసులు ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. ఆత్మీయ కలయిక సభకు సంబంధించిన ఫ్లెక్సీలు తొలగించి, రెడ్డి సంఘం గౌరవాధ్యక్షులు బయపురెడ్డి, అధ్యక్షులు నరేష్‌కుమార్‌రెడ్డి, ఇతర రాష్ట్ర కార్యవర్గ సభ్యులను అరెస్టు చేశారని వివరించారు. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ తొలి సమరయోధుడైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అనుమతించాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ రెడ్డి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు రాంభూపాల్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సతీష్‌కుమార్‌రెడ్డి, తిరుమలరెడ్డి, ప్రచార కార్యదర్శి రామశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన సంకల్పం వికసిత భారత్

కమలాపురం : మన సంకల్పం వికసిత భారత్ అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఎంపీడీఓ జ్యోతి అధ్యక్షతన సంబటూరు, పాచికలపాడు గ్రామాలలో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ప్రత్యేక మొబైల్ వాహనంలోని వీడియో ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఉపాధి హామీ, ఉజ్వల, పీఎం కిసాన్, పీఎం ఆవాస్ యోజన, జన్‌ధన్, ఆయుష్మాన్ భారత్ తదితర పథకాల గురించి వీడియో సందేశం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీతోనే భారత్ అభివృద్ధి సాధ్యం అయిందన్నారు. ప్రపంచంలో ఆర్థికంగా వేగంగా విస్తరిస్తున్న దేశం భారత్ అని ఇది కేవలం మోదీతోనే సాధ్యం అయిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి, తహసీల్దార్ సరస్వతి, ఏపీఎం అపర్ణ, హౌసింగ్ ఏఈ ప్రతాప్‌రెడ్డి, ఏపీఓ పార్థసారధి, ఈఓఆర్‌డీ శారదారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షంషాద్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతను అందరూ అర్థం చేసుకోవాలి

పోరుమామిళ్ల : ధనుర్మాస దీక్షలో భాగంగా ఆదివారం తెల్లవారు జామున గిరినగర్‌కాలనీ రామాలయం నుంచి పట్టణంలోని అమ్మవారిశాల వరకు 400 మంది మహిళలతో నగర సంకీర్తన జరిగింది. అనంతరం అమ్మవారిశాలలో జరిగిన ఆధ్యాత్మిక సమావేశంలో చిన్మయానంద మిషన్ మాతాజీ శ్రేయానంద సరస్వతి మాట్లాడుతూ మహిళల్లో ఆధ్యాత్మిక శక్తిని జాగృతం చేయడం దేశానికి అవసరమన్నారు. కార్యక్రమంలో చిన్మయానంద మిషన్ వారు పాల్గొన్నారు.

తలనీలాలు, టెంకాయలకు వేలం

కడప కల్చరల్ : కడప నగర సమీపంలోని పాలకొండల్లో గల శ్రీ పాలకొండరాయస్వామి ఆలయానికి సంబంధించి తలనీలాల సేకరణ, టెంకాయల విక్రయ హక్కుల కోసం ఈనెల 11వ తేదీన వేలంపాట నిర్వహించనున్నట్లు శ్రీ మృత్యుంజయేశ్వర స్వామి ఆలయ ఈఓ ఎ.శ్రీధర్ తెలిపారు. మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గల కార్యాలయంలో దేవదాయ ధర్మదాయశాఖ అధికారుల సమక్షంలో వీటికోసం బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు ఈఓ ఎ.శ్రీధర్ (73963 54149)ను సంప్రదించాలన్నారు.

ఓపీఎస్ హామీని నెరవేర్చాలి

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం పాత పెంఛన్ పథకాన్ని అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి డిమాండ్ చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఓపీఎస్ అమలు చేసిన సందర్భంగా ఆయన హర్షం వ్యక్తం చేశారు. మన రాష్ట్రం కూడా సంబంధిత హామీని అమలు చేయాలన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని ఆశా కార్యకర్తలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి, జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ కోరారు. ఆదివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆశాలకు వేతనం అరకొరగా ఇస్తున్నారని తెలిపారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో వారికి వెంటనే వేతనాలు చెల్లించాలన్నారు. అలవెన్స్‌లను కూడా చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు అమ్ములు, మంజుల, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

రేపు గండికోట దినోత్సవ కార్యక్రమాలు

కడప కల్చరల్: ఇండియన్ గ్రాండ్ క్యానియన్‌గా పేరుగాంచిన గండికోట ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు కడప ప్రభుత్వ పురుషుల కళాశాల టూరిజం విభాగం ప్రతినిధి ఎస్.పార్వతి తెలిపారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీతో కలిసి ఎంఓయూ కుదుర్చుకున్న తర్వాత తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గండికోటతోపాటు జిల్లా పర్యాటక అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

కబడ్డీ, వాలీబాల్ పోటీలు

మైదుకూరు : సంక్రాంతి పండుగ సందర్భంగా మైదుకూరులో కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్టు స్టార్స్ అసోసియేషన్ వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు మైదుకూరు జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ పోటీలు జరుగుతాయని వారు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లు ఈనెల 9వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఎ.చందు 6302095792, పి.కొండయ్య 9347579181, జి.సందీప్ 6303071471 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

వీధి దీపాలు ఏర్పాటు

కమలాపురం : ఎర్రగుడిపాడు గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఆయా కాలనీల్లో కొన్ని వీధి దీపాలు వెలగక పోవడంతో నివాసితుల ఫిర్యాదు చేశారు. స్పందించిన సర్పంచ్ వెంకటలక్షుమ్మ, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డిల ఆధ్వర్యంలో ఆదివారం మొత్తం 22 వీధి దీపాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ బ్రహ్మ నందరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

వీరపునాయునిపల్లె : స్థానిక వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమానికి సోమవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజ రు కానున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

విద్య, ఉపాధి లేని యువతపై సర్వే



ఎన్ఎస్ఎస్ వలంటర్లీకు సూచనలు ఇస్తున్న వైవీయూ కో ఆర్డినేటర్ వెంకట్రామిరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా కడప రవీంద్రనగర్‌లో ఆదివారం అధికారిక విద్య– సాధారణ ఉపాధిలో లేని యువత అనే అంశంపై సర్వే నిర్వహించారు. ఈ ఎన్ఎస్ఎస్ కార్యక్రమానికి యోగివేమన విశ్వవిద్యాలయం కో ఆర్డినేటర్ వెంకట్రామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల నిర్వహణలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ముందుండాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న క్యాంపులో భాగంగా ఇంటింటికి వెళ్లి 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయసు గల యువకులు అధికారిక విద్య గానీ ఉపాధి గానీ కలిగి లేకుంటే అటువంటి వ్యక్తులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారులు షకీలబేగం, గోవింద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు అన్నారు. కడపలోని ఆర్జేయూపీ భుజంగరావు టీచర్స్ హోంలో జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించి ఐఆర్‌ను తక్షణం విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ 2023 జూలై నుంచి 12వ పీఆర్‌సీ అమలు చేయాల్సి ఉందన్నారు. ఆరు నెలల కిందట పీఆర్‌సీ కమిషన్‌ను నియమించినా ఇప్పటి వరకు ఏ కార్యక్రమాలు చేపట్టలేదని అన్నారు. గత పీఆర్‌సీలో కూడా ఉద్యోగులకు ఏమాత్రం న్యాయం జరగలేదన్నారు. ఈ పీఆర్‌సీలో అయినా న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతో కాలంగా పెండింగ్‌లో పెట్టిన ప్రావిడెంట్ ఫండ్ ఏపీజీఎల్ఐ లోన్లు, సరెండర్ లీవు బిల్లులు, కరువుభత్యం బకాయిలు మొదలగు ఆర్థిక బకాయిలను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బాలాజీ, దాడి ఆంజనేయులు, టీచర్స్ హోం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారు రాజగోపాల్, వెంకటసుబ్బయ్య, రాష్ట్ర మహిళా కన్వీనర్ పసుపులేటి అనసూయదేవీ, సీనియర్ నాయకులు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలోని నబీకోటలో ఆదివారం గుల్‌ఖాన్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 220 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, మందులు, చుక్కల మందు పంపిణీ చేశారు. నబీకోట, రవీంద్రనగర్, మురాదియా నగర్, కాగితాలపెంట, మరాఠీ వీధి, అంబాభవానీ నగర్ తదితర ప్రాంతాల ప్రజలు ఈ శిబిరానికి వచ్చారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా కంటి ఆపరేషన్లు నిర్వహించేందుకు పుష్పగిరి ఆసుపత్రి వారు ముందుకు వచ్చారని ఏపీ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీఖాన్ తెలిపారు. ఈ శిబిరంలో గుల్‌ఖాన్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్ష,ఉపాధ్యక్షులు డాక్టర్ ఎజాజ్ అహ్మద్, చాన్ బాషా, కార్యదర్శి అలీమ్, సలహాదారులు ఫర్హతుల్లా, బాబా ఫక్రుద్దీన్, సహాయ కార్యదర్శి అన్వర్, పుష్పగిరి వైద్య బృందంలో అసిస్టెంట్ ఆప్తమాలజిస్ట్ పూజిత తదితరులు పాల్గొన్నారు.

తల్లి ప్రేమ ఎంతో గొప్పది



కందుల విద్యాసంస్థల చైర్‌పర్సన్ కందుల రాజేశ్వరమ్మకు కేక్ తినిపిస్తున్న చంద్ర ఓబుల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : తల్లి ప్రేమ ఎంతో గొప్పదని కందుల విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి తెలిపారు. కందుల గ్రూప్ విద్యాసంస్థల కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ 70వ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఓపెన్ ఆడిటోరియంలో కళాశాల కల్చరల్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మాతృమూర్తి రాజేశ్వరమ్మ పుట్టిన రోజు పురస్కరించుకుని కలియుగ పట్టణం సినిమాలో తల్లిప్రేమపై చిత్రీకరించిన ‘జో జో లాలి అమ్మ’ అనే పాట ప్రోమో ఆడియోను చిత్ర నిర్మాత కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, దర్శకులు రమాకాంత్‌రెడ్డి, రామా క్రియేషన్స్ ప్రొడ్యూసర్ మహేశ్వరరెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ అభి, హీరో విశ్వ కార్తికేయ ఓపెన్ ఆడిటోరియంలో విద్యార్థుల మధ్య వారికి అంకితం చేస్తూ ప్రారంచారు. ఈ కార్యక్రమంలో కందుల విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, కేఓఆర్ఎం కళాశాల చైర్మన్ వెంకట శివారెడ్డి, కేఎస్ఆర్ఎం ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి, కేఎల్ఎం మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీ రత్నమ్మ, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమకుమార్, కుమార్, వివిధ విభాగాల డీన్లు విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ధర్నాను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఎఫ్, ఏపీజీఎల్ఐ పొదపు సొమ్మును ప్రభుత్వం చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా పేర్కొన్నారు. ఆదివారం కడప యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. లేని పక్షంలో ఈ నెల 9,10 తేదీలలో విజయవాడలో 36 గంటల ధర్నా చేపడతామన్నారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు తరలివచ్చి, విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఏజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు పోతురాజు, చంద్రశస్త్రర్, గోపీనాథ్, అబ్దులగనీ, బత్తల చంద్రోఖర్, కిదార్నాథ్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దోమతెరల పంపిణీ



దోమతెరలను అందిస్తున్న లయన్స్ క్లబ్ గవర్నర్ జొన్నలగడ్డ రామచంద్రప్రకాష్‌రావు

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం లయన్స్ క్లబ్ గవర్నర్ జొన్నలగడ్డ రామచంద్రప్రకాష్ రావు జన్మదినం సందర్భంగా ఆయన మనవడు అశుతోష్ మౌలి, పవన్ కుమార్ 75 మంది దివ్యాంగులకు దోమ తెరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జొన్నలగడ్డ రామచంద్ర ప్రకాష్‌రావు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా 47 ఏళ్ల నుంచి అనేక సేవా కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. ఆల్ ఆఫ్ యూ దివ్యాంగుల సేవా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్, గౌరవాధ్యక్షుడు చలపతిరావు ఆధ్వర్యంలో రామచంద్రప్రకాష్‌రావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, రామలింగేశ్వర, సత్యనారాయణ, కిరణ్ కుమార్, లలిత గుప్తా, అబ్దుల్ రషీద్, సంజీవ్ హనుమంత్, సావిత్రి, లక్ష్మీదేవి, జాషువా తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడిలో రాణించాలి



కూచిపూడి నృత్యం చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : కూచిపూడి నాట్యంలో మెళకువలు నేర్చుకుని రాణించాలని కేంద్ర సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత డాక్టర్ వసంత్ కిరణ్ పేర్కొన్నారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని సత్యనారాయణస్వామి ఆలయ కల్యాణ మండపంలో నృత్య తరంగిణి కళా నిలయం ఆధ్వర్యంలో భరత కళా వసంతం పేరుతో వర్క్‌షాప్ నిర్వహించారు. కూచిపూడి నాట్యంలో జూనియర్, సీనియర్ విభాగంలో విద్యార్థులకు అడుగులు, జతులు, తాళాలు, నట్టువాంగం, సంగీతం, కృతి, జాలంధరంలతో పాటు నాట్యంలోని పలు అంశాలను, మెళకువల్లో శిక్షణ ఇస్తున్నారు. కూచిపూడి కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రీ పాల్గొని కూచిపూడి నృత్య ప్రాముఖ్యతను, శాస్త్రపాఠాలను వివరించారు. కార్యక్రమంలో నృత్య తరంగిణి కళానిలయం నిర్వాహకుడు టి.శ్రవణ్‌కుమార్, రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, కేరళ ప్రాంతాలకు చెందిన నాట్యగురువులు, విద్యార్థుల తల్లి దండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా సోమవారంతో వర్క్‌షాప్ ముగియనుంది.